ప్రజాశక్తి

శుక్రవారం 12 డిసెంబర్ 2025 5 విజయనగరం

బల్లంకిలో ధాన్యం కొనుగోలు బాధ్యత 'వెలుగు'కే

ఆదేశాలు జారీ చేసిన జెసి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు బాధ్యతను వెలుగు విభాగానికి అప్పగించారు. బల్లంకిలో టిఎపిసిస్ సిబ్బంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సక్రమంగా చేపట్టడం లేదని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎంపిటిసి గొంప తులసి.. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ ఈ నెల 9న క్షేత్రస్థాయిలో పర్యటించి, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. జెసి పరిశీలనలో సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని రుజువైంది. దీంతో బానాది, బల్లంకి, ఎన్‌కెఆర్ పురం, కొంపల్లి గ్రామాల రైతులు ఆమోదం మేరకు వెలుగు విభాగానికి ధాన్యం కొనుగోలు బాధ్యతను అప్పగించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు వెలుగు ఎపిఎం సూర్యనారాయణ తెలిపారు.

గుర్లగెడ్డ రిజర్వాయరు

గుర్ల గెడ్డ సాగునీటి ప్రాజెక్టు పనులు పాతికేళ్లుగా పడకేశాయి. ఈ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి తప్ప, అధికార ప్రతిపక్షాలు ఇచ్చిన హామీ మాత్రం నెరవేరడం లేదు. దీంతో, ఓ తరం దాటిపోతున్నా నీరు మాత్రం అందడం లేదంటూ రైతులు, వ్యవసాయ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా మోసం చేస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. నాయకుల మాటలపై విశ్వాసం కూడా స్థానికుల్లో సన్నగిల్లుతోంది.

పాతికేళ్లుగా నిర్లక్ష్యం

- పడకేసిన గుర్లగెడ్డ ప్రాజెక్టు నిర్మాణం
- అప్పడప్పుడు రివైజ్డ్ అంచనాలతో సరి
- ఏటా పెరుగుతున్న బడ్జెట్ వ్యయం
- నీరుగారుతున్న 3వేల ఎకరాల ఆయుకట్టు లక్ష్యం



పిచ్చిమొక్కల మధ్య షట్టర్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మెంటాడ మండలం గుర్ల, అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీల పరిధిలో గుర్ల గెడ్డ జలాశయాన్ని 2000లో అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.4.28కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. 2,978 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది దీని లక్ష్యం. వాస్తవానికి జలాశయం గట్టు పొడవు, ఎత్తు పెంచితే సుమారు 8వేల ఎకరాల వరకు సాగునీరు అందించవచ్చని సాగునీటి పారుదల శాఖ ఇంజినీర్లు అప్పట్లో చెప్పారు. ఇందుకు అనుగుణంగా ప్రాజెక్టు డిజైన్‌ను అప్‌గ్రేడ్ చేసి తగిన నిధులు కేటాయించాలని అప్పట్లో సిపిఎం నాయకులు కీర్తిశేషులు ఆర్.కృష్ణానాయుడు ఆధ్వర్యాన రైతులు పెద్దపోరాటమే చేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ సంగతి కాస్త అటుంచితే... నాటి బడ్జెట్‌తో జలాశయం ప్రధాన గట్టును దాదాపు నిర్మించినప్పటికీ, కొండవరకు ఉన్న 150 మీటర్ల మేర గట్టును అటవీశాఖ అనుమతులు లేవనే సాకుతో అసంపూర్తిగా వదిలేసింది. ఇప్పటికీ అటవీశాఖ అనుమతులు లేవనే చెబుతున్నారు. మరోవైపు ఎడమ కాలువ ద్వారా నీటిని మళ్లించేందుకు జలాశయం నుంచి సుమారు కిలోమీటరు పొడవున అక్విడెక్టు నిర్మించారు. బడ్జెట్ సరిపోకపోవడం, రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడం వంటి కారణాలతో కుడికాలువ పనులు ఆదిలోనే హంసపాదులా నిలిచిపోయాయి. ఇదంతా 2004 ఎన్నికలకు ముందు మాట. ఆ తరువాత ప్రభుత్వం దీని గురించి పట్టించు కోకపోవడంతో అక్విడెక్టు మరమ్మతులకు గురైంది. రెండు చోట్ల పిల్లర్లు కూడా విరిగిపోయాయి. అసంపూర్తిగా వున్న జలాశయ గట్టు కూడా అటవీశాఖ అభ్యంతరం వల్ల పూర్తికాలేదు. దీంతో, రూ.కోట్లు ఖర్చు చేసినప్పటికీ జలాశయం ద్వారా చుక్క సాగునీరు కూడా అందని పరిస్థితి. జలాశయానికి పైనవున్న కొండకోనల నుంచి వచ్చిన నీరు గుర్లగెడ్డ ద్వారా చంపావతి నది ద్వారా వృథాగా సముద్రంలోకి పోతోంది. ఈ సమస్యను సిపిఎం, ఏపీ రైతు సంఘం నాయకులు మారిన ప్రతి ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నారు. అంతే కాదు.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు కూడా స్థానిక ఎమ్మెల్యే లేదా మంత్రులను కలిసి వినతిపత్రాలు కూడా సమర్పిస్తున్నారు. ఆయా సందర్భాల్లో ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడం, ఆ తరువాత ప్రభుత్వానికి లేఖలు రాయడం మినహా ఒత్తిడి చేయలేదు. దీంతో, ఈ సాగునీటి ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఎన్నికల సమయాల్లో మాత్రం దీనిపై హామీలు గుప్పిస్తూ వస్తున్నారు. అప్పుడప్పుడు మొక్కుబడిగా స్పందిస్తున్న మంత్రులు రివైజ్డ్ అంచనా నివేదికల తయారీకే పరిమితమౌతున్నారు. 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వంలో రూ.16కోట్ల అంచనా రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అది కూడా అమలుకు నోచుకోలేదు. టిడిపి అధికారంలోకి వచ్చాక 2024 జులైలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అప్పటి కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌లకు రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు మరోసారి వినతి అందచేశారు. మంత్రి స్పందిస్తూ నివేదిక అందజేయాలంటూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో, అదే నెలలో అప్పటి డిఇలు గోవిందరావు, పాండురంగారావు ప్రాజెక్టును సందర్శించి నివేదిక అందజేశారు. ఆ తరువాత అది ఏమైందో అధికారులు, ప్రజాప్రతినిధులకే ఎరుక. పాతికేళ్లుగా పాలకుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న ఎవోకర్ సిటీ అనే ఓ ప్రైవేటు యాజమాన్యం ఈ ప్రాజెక్టు ఎడమకాలువను కప్పేసి వెంచర్ వేసేసింది. అంతటితో ఆగలేదు. ప్రాజెక్టు మిగులు భూములను కూడా ఆక్రమించింది. దీంతో, అందులో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులు ఉపాధి కోల్పోయారు. కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందాన ప్రాజెక్టు వస్తే పుష్కలంగా పంటలు పండించుకోవచ్చన్న ఆశతో భూములు త్యాగం చేస్తే, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నీరు రాలేదు సరికదా ఉన్న భూములు కూడా కోల్పోవాల్సివచ్చిందని అమాయక గిరిజనులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రబీకి సరిపడా యూరియా సిద్ధం

జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో రబీ అవసరాలకు సరిపడా యూరియా సిద్ధంగా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను, అన్ని పంటలకు అవసరమైన 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక రూపొందించామని, దీనిలో భాగంగా రబీకి స ఎరువులను సిద్ధం చేశామని తెలిపారు. సీజను ప్రారంభంలో ఈ ఏడాది అక్టోబరు 1 నాటికి 1,295 మెట్రిక్ టన్నుల యూరియా ప్రారంభనిల్వగా అందుబాటులో ఉందని చెప్పారు. అక్టోబరు నుంచి డిసెంబరు చివరినాటికి జిల్లాకు మొత్తం 10,660 మెట్రిక్ టన్నుల అవసరం కాగా, ఇప్పటికే 8,058 మెట్రిక్ టన్నులను రైతులకు అందుబాటులో ఉంచామని, ఈ నెలాఖరుకు ఇంకో 2,600 మెట్రిక్ టన్నులు జిల్లాకు రానున్నదని తెలిపారు. అక్టోబరు 1 నుంచి ఈ నెల 10వ తేదీవరకు జిల్లాలో సుమారు 5110 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించామన్నారు. ఈ నెలాఖరు వరకు 3,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా , ప్రస్తుతం 3,058 మెట్రిక్ టన్నులను యూరియా ఆర్.ఎస్.కె లలో, మార్క్ ఫెడ్ గోదాములలో అందుబాటులో ఉందని వివరించారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరతనుసృష్టించినా, ఎరువులను మళ్లించినా, ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

పూసపాటిరేగ పోలీసు స్టేషనులో 2023లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు పూసపాటిరేగ మండలం పెద పతివాడ గ్రామానికి చెందిన మైనపు హరీష్ (19)కు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్లకఠిన కారాగార శిక్ష, రూ. 3,500 జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ గురువారం తీర్పు వెల్లడించారని ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. పెదపతివాడ గ్రామానికి చెందిన మైనపు హరీష్ 2023 జులై 4న అదే గ్రామానికి చెందిన బాలిక (8) పాఠశాలకు వెళ్తున్న సమయంలో కిడ్నాప్ చేసి దగ్గరలో ఉన్న కొబ్బరి తోటలోకి ఎత్తుకుపోయి బాలత్కారం చేసాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పూసపాటిరేగ పోలీసు స్టేషనులో పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసారు. అనంతరం, అప్పటి విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ళ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసులు తరుపున పోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎం.ఖజానారావు వాదనలు వినిపించారు.

ట్రావెల్ బస్సులో రూ. 69 లక్షలు చోరీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సులో బుధవారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఈ చోరీలో రూ.69 లక్షలు చోరీకి గురైనట్లు బాధితులు జామి చంద్రశేఖరరావు, వి. వినోద్‌బాబు చెబుతున్నారు. బాధితులు రియల్ ఎస్టేట్ పని మీద శ్రీకాకుళం నుంచి విజయవాడకు వెళ్తున్నారు. ఇద్దరూ రెండు బ్యాగుల్లో కోటి 29 లక్షలతో బస్సు ఎక్కారు. మార్గమధ్యంలో పూసపాటిరేగ మండలంలోని చోడమ్మఅగ్రహారం వద్ద భోజన విరామం కోసం బస్సు డ్రైవర్ బస్సును ఆపారు. బాధితులు ఒకరు బస్సులో భోజనం చేయగా ఇంకొకరు హోటల్‌కు వెళ్లారు. బస్సులో భోజనం చేసిన వ్యక్తి చేతులు కడుక్కోవడానికి కిందకి దిగి హోటల్ వైపు వెళ్ళాడు. ఇంతలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఒక బ్యాగు పట్టుకొని పరుగులు పెట్టినట్లు బస్సులో ప్రయాణికులు చెబుతున్నారు. వెంటనే బాధితులు తమ బ్యాగ్‌లను పరిశీలించుకోగా రూ.69లక్షలు మాయమైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూసపాటి రేగ ఎస్‌ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ

13న పారా పవర్ లిఫ్టింగ్ పోటీలు

ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 13 న రాజీవ్ క్రీడా మైదానంలో జరుగనున్న 4వ రాష్ట్ర స్థాయి పారా పవర్ లిఫ్టింగ్ పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పిలుపు నిచ్చారు. ఈ పోటీలకు సంభందించిన గోడ పత్రికను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్‌తో కలిసి గురువారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేసారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ వికలాంగుల దినోత్సవం సందర్బంగా 7 వరాలను ముఖ్యమంత్రి ప్రకటించారని అన్నారు. రాష్ట్ర స్థాయి పారా క్రీడలు విజయనగరంలో నిర్వహించడం మంచి పరిణామమని అన్నారు. ఈ పోటీల్లో వికలాంగులంతా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని అకాంక్షించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్

ప్రజాశక్తి-బొండపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్.. ఎస్‌ఐ యు.మహేష్‌కు సూచించారు. గురువారం బొండపల్లి పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ సమీపంలో 26వ నంబర్ జాతీయ రహదారిని పరిశీలించారు. జాతీయ రహదారి పరిధిలో లైట్లు ఏర్పాటు చేయాలని, స్పీడ్ బ్రేకర్లు వేయించి వాటిపై రేడియం స్టిక్కర్లు అతికించాలని ఎస్‌ఐని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు రోడ్డుపై స్టాపర్లు అవసరమని చెప్పారు. కార్యక్రమంలో గజపతినగరం సిఐ ఎ.వి రమణ, తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్

ప్రయివేటు సేవలో పోలీస్ యంత్రాంగం

- రోడ్డుపక్కనే డ్యాన్స్ ప్రోగ్రామ్‌కు అనుమతి
- స్తంభించిన ట్రాఫిక్
- అవస్థలు పడ్డ వాహనదారులు, ప్రయాణికులు
- పోలీసులు ఇంతలా ఎందుకు సహకరిస్తున్నారో అంటూ జనాల్లో చర్చ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తమ సమస్యను పరిష్కరించాలంటూ రోడ్డు పక్కన నిరసన వ్యక్తం చేసే రైతులు, విద్యార్థులు, కార్మికులు తదితర తరగతులను బెదిరింపులు, అరెస్టులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పోలీసులు ఓ ప్రైవేటు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా రోడ్డుపక్కన డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించేందుకు అవకాశం ఇచ్చేశారు. అంతటితో ఆగలేదు. ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి ప్రముఖుల మాదిరిగా పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఇంత ప్రోటోకాల్ దేనికయ్యా.... అంటే సినీ నటి వచ్చిందట. ఓవైపు ట్రాఫిక్ పోలీసులు, మరోవైపు సివిల్ పోలీసులు కలుపుకుని భారీగానే అక్కడ కనిపించారు. ఇంకోవైపు షాపింగ్ మాల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన బౌన్సర్లు కూడా రోడ్డును బ్లాక్ చేసి హడావుడి చేశారు. ఇంత హడావుడి చేసినప్పటికీ అటు ఎల్‌ఐసి బిల్డింగ్ నుంచి ఇటు ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. గురువారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇదే పరిస్థితి కనిపించింది.

మరోవైపు భారీ శబ్దాలతో సౌండ్ పొల్యూషన్, పాలిథిన్ ముచ్చుల ఎగరవేతతో అటు ట్యాంక్ బండ్‌రోడ్డు నుంచి ఇటు మయూరి జంక్షన్ వరకు రోడ్లన్నీ చిదరవందరగా మారాయి. పోలీసులంతా నోళ్లు ఎల్లబెట్టి చూడడం తప్ప కనీసం ట్రాఫిక్‌ను చక్కదిద్దే పరిస్థితి కూడా చేయలేదు. మొత్తం పోలీసులంతా ఇక్కడే మూగివుండడంతో ఆర్టీసి కాంప్లెక్స్, మయూరి జంక్షన్, ఎత్తిబ్రిడ్జి వద్ద కూడా ట్రాఫిక్ సిబ్బంది కనిపించలేదు. ఆ సమయంలో ఇక్కడ ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు చర్చించుకోవడం కనిపించింది. గ్రామాలు, పట్టణాల్లో వినాయక విగ్రహాల ప్రతిష్ట, ఆయా సందర్భాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల అనుమతి కోసం ముప్పతిప్పలు పెట్టే పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయని తెలిసినా ఎందుకు అనుమతిచ్చారనే అంతరార్థం వారికే ఎరుక. మరోవైపు ఓ ప్రైవేటు ప్రోగ్రామ్‌కు పోలీసు అధికారులు ఇంతలా హడావుడి చేశారంటే యాజమాన్యం ప్రలోభాలకు గురిచేసిందా? లేక పోలీసులే ప్రభావితమయ్యారా? అనే విమర్శలు కూడా వ్యక్తమౌతున్నాయి. ఎమ్మెల్యే, మేయర్ వంటి ప్రజా ప్రతినిధులు ఈ ప్రారంభోత్సవానికి వచ్చారని పోలీసులు సమర్థించుకుంటే పొరపాటేనని, ఇంతకు ముందు ఇలాంటి ప్రారంభోత్సవాలు నగరంలో చాలా జరిగాయని, మంత్రులు ఇచ్చినప్పుడు కూడా ఇంత రక్షణ చర్యలు, హడావుడి చేయలేదని జనం చర్చించుకుంటున్నారు. పోలీసులే దగ్గరుండి మరీ ఇంతటి అసౌకర్యానికి సహకరించారని చర్చ నడుస్తోంది. మరోవైపు షాపింగ్‌మాల్ ఏర్పాటుకు పూర్తిస్థాయిలో అనుమతులు కూడా లేవన్న విమర్శలు వస్తున్నాయ.

ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అర్హత ఉన్న భవనాలకు బిపిఎస్ ముద్రలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో భవన క్రమబద్ధీకరణ పథకం కింద అర్హత ఉన్న ఆస్తులకు బిపిఎస్ అనే ముద్రలు ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రణాళిక సిబ్బంది కార్యదర్శులు ప్రత్యేక సిబ్బందితో బిపిఎస్ అనే ముద్రలను ముద్రిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ భవనాలు, లే అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమబద్ధీకరణ దిశగా చొరవ చూపాలన్నారు. ఈ విషయమై ప్రజలు మరింత అవగాహన పెంచుకొని తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పారు.

అదనపు భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

అదనపు భవన నిర్మాణాలకు కూడా ప్రణాళిక అధికారుల అనుమతులు తప్పనిసరి అని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. రింగ్ రోడ్డు ప్రాంతంలో ఓ భవనంపై అంతస్తు అనుమతులు లేకుండా నిర్మించడాన్ని గుర్తించిన ప్రణాళిక సిబ్బంది నిర్మిత భవనాన్ని కూల్చివేశారు. పిల్లర్లను కూడా తొలగించారు.

15న పొట్టి శ్రీరాములు వర్ధంతి

ప్రజాశక్తి-విజయనగరం

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతికార్యక్రమం ఈనెల 15న ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.

ఆస్తి పన్ను మొండి బకాయిలను ఉపేక్షించం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తి పన్ను మొండి బకాయిలను ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులు మొండి బకాయిదారులు వద్దకు వెళ్లి గురువారం రెడ్ నోటీసులు జారీ చేశారు. కొంతమంది గడువు కోరగా, మరి కొంతమంది తక్షణమే బకాయిలను చెల్లించారు. ఆస్తి, ఖాళీ స్థలముల పన్నులు సత్వరమే చెల్లించి సహకరించాలన్నారు. లేని ఎడల రెడ్ నోటీసులు జారీ చేస్తామని, తదనంతరం చర్యలను తీసుకుంటామని చెప్పారు.

ప్లాస్టిక్ విక్రయాలపై నగరంలో విస్తతంగా తనిఖీలు

నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు, వినియోగాలపై ప్రజారోగ్య సిబ్బంది గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. దుకాణాలు, బడ్డీ కొట్లు, టిఫిన్ షాపులు వద్ద క్యారీ బ్యాగులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు ఉండడాన్ని గమనించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అపరాధ రుసుము విధించారు.

23వ సచివాలయాన్ని సందర్శించిన కమిషనర్

నగరంలోని 23వ నెంబర్ సచివాలయాన్ని కమిషనర్ నల్లనయ్య సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. వీధులలో చెత్తలు తరలించే ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికుల విధుల హాజరు పట్టికను గమనించారు. నిర్ణీత సమయానికి విధులకు వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. సచివాలయాల పరిధిలో పారిశుధ్య పర్యవేక్షణ సంబంధిత కార్యదర్శులదేనని చెప్పారు.

ఎటిఎల్ వర్క్‌షాప్‌ను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఫూల్‌బాగ్ ఆదర్శ పాఠశాలలో నాలుగు రోజుల ఎటిఎల్ వర్క్‌షాప్‌లో భాగంగా 3డి ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌ను గురువారం డిఇఒ యు. మాణిక్యంనాయుడు సందర్శించి విద్యార్థుల శిక్షణలో భాగంగా నేర్చుకున్న 3డి ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ విషయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులే స్వయంగా తయారుచేసిన కీ చైన్‌ని డిఇఒకు అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్ , ప్రిన్సిపాల్, అటల్ ల్యాబ్ ఇన్చార్జ్ ఆర్.రాజ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో 50మంది విద్యార్థులు 3డి ప్రింటింగ్ డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా డొంకాడ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా డొంకాడ రామకృష్ణ నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రామకృష్ణది పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం చినకుదమ గ్రామం. ఈయన గతంలో కురుపాం ఎఎంసి చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం టిడిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ఉన్నారు.

శిక్షణకు హాజరైన వారితో డిపిటిఒ వరలక్ష్మి

ఆర్‌టిసిలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపిఎస్‌ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో 25వ బ్యాచ్ ను గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారిని వరలక్ష్మి ప్రారంభించారు. లైట్ వెహికల్ లైసెన్స్‌కు ఏడాది అనుభవం కలిగి 21 ఏళ్లు నిండినవారు అర్హులని తెలిపారు. శిక్షణ 40 రోజుల పాటు ఉంటుందన్నారు. తొలిసారిగా ఒక మహిళా అభ్యర్థి చేరడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, శిక్షకుడు రాజు పాల్గొన్నారు.

21లోగా అకౌంట్ టెస్టు ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

త్వరలో జరగనున్న హెడ్ మాస్టర్స్ అకౌంట్స్ టెస్ట్ పేపర్ 1,2 పరీక్ష రుసుము చెల్లించేందుకు, దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 21వరకు గడువు పెంచినట్లు డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష రుసుము రూ.60 చెల్లించి, దరఖాస్తులను కోటలోని స్ట్రాంగ్‌రూమ్ వద్ద 23వ తేదీలోగా అందజేయాలని తెలిపారు. వివరాలకు www.bse.ap.gov.in సందర్శించాలని పేర్కొన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఎస్‌జిటి, ఇజిబిటి పరీక్ష రాసేందును ఆఖరు తేదీ ఈనెల 21 అని డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. అపరాధ రుసుంతో ఈనెల 23లోగా దరఖాస్తు చేయవచ్చునని తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం : జిల్లా సమన్వయ అధికారి మాణిక్యం

ప్రజాశక్తి-కొత్తవలస

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న 10 వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేయాలని గురుకుల జిల్లా సమన్వయ అధికారి ఎం.మాణిక్యం తెలిపారు. గురువారం వియ్యం పేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గల 13 పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీచర్లకు ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించడానికి విద్యార్థులకు ఇప్పటినుండి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ప్రతి పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ప్రణాళిక బద్ధంగా పాఠ్యాంశాలు బోధన చేయాలని హితవు పలికారు. పాత ప్రశ్న పత్రాలను ఎంపిక చేసుకుని తరచూ వస్తున్న ప్రశ్నలకు గుర్తించి, అటువంటి ప్రశ్నా పత్రాలను వెనకబడిన ఉన్న విద్యార్థులను ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. రెండు జిల్లాలలో బాలురు 5 పాఠశాలలు, బాలికలు 8 పాఠశాలలు మొత్తం 13 పాఠశాలలు ఉన్నాయని, పదో తరగతి 911 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 639 మంది, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం 653 మంది పరీక్షలు రాస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి బుద్ధ సిఇఒ ఫౌండేషన్ మోటివేటర్ సుజాత శ్రీరామ మోటివేషన్ క్లాసు చెప్పారు. అనంతరం వియ్యంపేట స్కూలులో వంటగది, ఎటిఎల్ రూమ్, లైబ్రరీ రూమ్ , డార్మిటరీ పరిశీలించారు. కార్యక్రమంలో 13 పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, వియ్యంపేట ప్రిన్సిపాల్ ఎంవిఎస్ లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా సమన్వయ అధికారి మాణిక్యం

ఐక్యరాజ్యసమితిలో ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక సీతం కళాశాల ఎన్‌సిసి ఆధ్వర్యంలో 'లైంగిక దోపిడి- వేధింపుల నివారణ', 'ఐక్యరాజ్యసమితిలో ఉపాధి అవకాశాలు" అనే అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌సిసి 2 ఆంధ్ర కాంపోజిట్ టెక్నికల్ రెజిమెంట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ యు. కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లైంగిక దోపిడి, వేధింపుల నివారణ అంశంపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ఐక్యరాజ్యసమితిలో వివిధ రంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమగ్ర వివరణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలను ఉపయోగించుకొని గ్లోబల్ అవకాశాలను అన్వేషించాలని సూచించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ వర లక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సిఎస్ఒ సత్యనారాయణ, నాయక్ సుబేదార్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శాసనపల్లి గ్రామస్తులు

హైలెవెల్ బ్రిడ్జికి నిధులు మంజూరు

సిఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-జామి

జామి మండలంలోని శాసనపల్లి, గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామాల మధ్య ఉన్న గెడ్డపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో శాసనపల్లి గ్రామస్తులు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గ్రామంలో ర్యాలీ చేపట్టి, రచ్చబండ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆకిరి వెంకటరావు, సాధనాల రాంబాబు, గులిపల్లి వెంకట్రావు, వలిశెట్టి సతీష్ పాల్గొన్నారు.

నేడు శృంగవరపుకోటలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజా సమస్యలను అర్జీ రూపంలో అందజేయాలని కోరారు.

గంట్యాడ మండల ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ మండల ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్ పాణి నియమితులయ్యారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పలు అంశాలపై సమీక్షించారు. శాఖల వారీగా ఆరా తీశారు. గ్రామంలో ఏ అంశంపైనా నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు. అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కారుకొండ రాముడు కుటుంబానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు రూ.10 వేలు నగదు, నిత్యావసర సామగ్రిని గురువారం అందజేశారు. ఇంటి స్థలం, ఇల్లు కూడా మంజూరయ్యేలా చూడాలని స్థానిక రెవెన్యూ, సచివాలయ సెక్రటరీని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ సుధారాణి, ఎంపిపి సండి సోమేశ్వరరావు, సర్పంచ్ వబ్బిన త్రినాథమ్మ, వబ్బిన సతీష్ పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తపాలా సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని విజయనగరం డివిజన్ ఎస్‌పి కె.శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ సమావేశ మందిరంలో ఎస్.కోట సబ్‌డివిజన్ పరిధిలో తపాలా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18, 19, 20వ తేదీల్లో బీమా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్.కోట సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్, ఎస్‌పిఎంలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులను తొలగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఆక్రమణలో ఏమైనా ప్రభుత్వ భూములుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

18 నుంచి మిరాకిల్ సిటీలో డిజిటల్ సమ్మిట్

ప్రజాశక్తి - భోగాపురం

ఈ నెల 18 నుండి 21 వరకు భోగాపురం మిరాకిల్ సిటీలో డిజిటల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. జనరేటివ్ ఏఐ, క్లౌడ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక టెక్నాలజీలపై నిపుణుల వివరిస్తారని ఆ సంస్థ ప్రతునిధులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, 24 గంటల హ్యాకథాన్ ఈ సమ్మిట్‌కు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని తెలిపారు. యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇది గొప్ప అవకాశం అని మిరాకిల్ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులు digital-summit.inలో రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు. అనంతరం సమ్మిట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే లోకం నాగమాధవి గురువారం ఆవిష్కరించారు.

ఉద్యాన పంటల సాగుపై శిక్షణ

కొత్తవలస : మండలంలో రెల్లి గ్రామంలో ఉద్యాన పంటలపై రైతులకు ఉద్యాన శాఖ అధికారి పి.పద్మ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రస్తాకుంటుబాయి కెవికె శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు మాట్లాడుతూ జీడి మామిడి తోటలలో కొమ్మ కత్తిరింపులు విధానం, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు.

రోడ్డు నిర్మాణం పట్ల హర్షం

బొబ్బిలి : బొబ్బిలి - తెర్లాం రోడ్డు నిర్మాణంపై ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లి, అలజంగి రోడ్డు వద్ద గురువారం ప్రజలు, విద్యార్థులు ప్లకార్డులతో రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బేబినాయనకు కృతజ్ఞతలు చెప్పారు.

రామస్వామిపేటలో పట్టపగలే చోరీ

ప్రజాశక్తి-వేపాడ

రామస్వామిపేటలో గురువారం పట్టపగలే దొంగతనం చోటు చేసుకుంది. బెహరా ఈశ్వరరావు, భార్య చిలకమ్మ ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పగులగొట్టి బీరువా లోపలి 5 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఉదయం కుటుంబ సభ్యులు బయటకు వెళ్లి, మధ్యాహ్నం ఇంటికి తిరిగివచ్చే సరికి తలుపులు పగలగొట్టి ఉండటంతో వల్లంపూడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎస్.సుదర్శన్ క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆధారాల సేకరణతో పాటు సమీప ప్రాంతాల సిసి పుటేజీలను కూడా పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

నిధుల స్వాహాపై విచారణ

మా డబ్బులు మాకు ఇవ్వాలని మహిళల డిమాండ్

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని తునివాడ గ్రామంలో బ్యాంక్ కరస్పాండెంట్, వెలుగు విఒఎ మహిళా సంఘాల నిధులు స్వాహా చేశారని పత్రికల్లో వచ్చిన కథనాలకు బ్యాంకర్లు స్పందించి గురువారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. దీంతో గ్రామ మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు బ్యాంకర్లను చుట్టుముట్టారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రేగిడి యూనియన్ బ్యాంక్‌కు సంబంధించిన బ్యాంక్ కరస్పాండెంట్ అల్లు శ్రీధర్, అతని భార్య డికెడిఒ వెలుగు విఒఎ అరుణకుమారి సుమారు రూ.30.46లక్షలకు సంబంధించిన డ్రా చేసిన మహిళా సంఘాల నిధులు పై యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ ఎ.శ్రీనివాసరావు, రీజనల్ ఎన్‌ఆర్‌సిటి రాము గ్రామానికి చేరుకొని నిధులు స్వాహా పై ఆరా తీశారు. బ్యాంకర్లు, బ్యాంక్ కరస్పాండెంట్ కుమ్మక్కై మహిళా సంఘాల డబ్బు కాజేశారని బ్యాంకర్లను మహిళలు నిలదీశారు. దీనిపై స్పందించిన రీజనల్ హెడ్ మహిళా సంఘాలతో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బ్యాంక్ కరస్పాండెంట్ అల్లు శ్రీధర్, తన భార్య అరుణ ఇంటికి తాళాలు వేసి పరారీలో ఉన్నారని అన్నారు. శుక్రవారం నుండి గ్రామంలో బ్యాంకు లావాదేవీలపై మహిళా సంఘాలతో విచారణ చేపట్టి న్యాయం చేస్తామన్నారు. నిధులు స్వాహాపై నిర్ధారణయితే రికవరీ తో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సంఘ సభ్యులు ఏ ఒక్కరూ అధైర్య పడద్దని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వీరితోపాటు బ్యాంక్ మేనేజర్ రాజేష్, బ్యాంక్ సిబ్బంది, స్థానిక సర్పంచ్ ఉషారాణి ధనుంజయరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామంలో విచారణ చేస్తున్న బ్యాంకు అధికారులు

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సైకిల్ యాత్ర

ప్రజాశక్తి- రేగిడి, సంతకవిటి, రాజాం

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసులు చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్ర గురువారం పాలకొండ నుంచి ప్రారంభమై రేగిడి ఆముదాలవలస, సంతకవిటి మండలాలలో విశేష స్పందనతో కొనసాగింది. మొదటగా రేగిడి ఆముదాలవలస సంకిలి బ్రిడ్జి వద్ద అభ్యుదయం సైకిల్ యాత్రను చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్ర, రేగిడి ఆముదాలవలస ఎస్ఐ బాలకృష్ణ ఘనంగా ఆహ్వానించారు. ఈ అభ్యుదయం సైకిల్ ర్యాలి సుమారు 500 మంది విద్యార్థులు, ప్రజలతో విద్యార్థులు, ప్రజలతో కలిసి కోలాటాలు, వాయిద్యాలు, డిజెల నడుమ జన సందోహంతో ప్లకార్డులు చూపిస్తూ, డ్రగ్స్ పై నినాదాలు చేస్తూ సంకిలి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు చేరుకుంది. అనంతరం అక్కడ విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. డిఎస్‌పి రాఘవులు, రాజాం రూరల్ సిఐ ఉపేంద్ర రావు, స్థానిక ఎస్ఐ వి.బాలకృష్ణ స్వయంగా సైకిల్ యాత్రలో పాల్గొని సైకిల్ తొక్కుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మత్తు పదార్థాలపై అభ్యుదయ సైకిల్ యాత్ర సభ్యులు, పోలీస్ సిబ్బంది కలిసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సైకిల్ యాత్ర అంబేద్కర్ గురుకుల పాఠశాల వరకూ సాగింది. ముందుగా ర్యాలీకి ఉంగరాడ మెట్ట వద్ద విద్యార్థులు స్వాగతం పలకగా ఉంగరాడ పోలీస్ స్టేషన్ మీదగా కొర్లవలస జంక్షన్ వరకు సాగింది. అక్కడి నుంచి సంతకవిటి మండలం జిఎంఆర్ఐటి నుంచి పొనుగటివలస మీదుగా రాజాం పట్టణానికి సైకిల్ యాత్ర చేరింది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్ రామినాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజాంలో సైకిల్ యాత్రకు చీపురుపల్లి డిఎస్‌పి రాఘవులు, రూరల్ సీఐ ఉపేంద్ర, సంతకవిటి ఎస్ఐ గోపాలరావు, పలు విద్యార్థులు ఘనసాగతం పలికారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, వికాస తరంగిణి కన్వీనర్ టిటివి రమణమూర్తి, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్‌యాత్రలో పాల్గొన్న డిఎస్‌పి రాఘవులు, సిఐ ఉపేంద్ర తదితరులు

010 పద్దుపై కార్మికులకు జీతాలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో నిర్వహించిన మాటా మంతి కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్ పారిశుధ్య కార్మికులపై చర్చించారు. జిల్లాలో పారిశుధ్య కార్మికుల జీతాల సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 010 పద్దు కింద పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరడంతో గురువారం పారిశుధ్య కార్మికులు ఎంపిడిఒ సురేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎన్ రామ్మోహన్‌రావు, ఈశ్వరరావు, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రజతోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలో భవానీనగర్ వద్దనున్న గౌరీ విద్యానికేతన్ హైస్కూల్‌లో మూడు రోజుల రజతోత్సవ సంబరాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ సైన్స్ ఫెయిర్‌తో సంబరాలు ప్రారంభించినట్లు కరస్పాండెంట్ సన్యాసినాయుడు తెలిపారు. ఎంఇఒ నర్సింగ్ రావు, సిఐ బి.నారాయణమూర్తి విద్యార్థుల ప్రాజెక్టులను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాము, జయవిష్ణు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ

ప్రజాశక్తి వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ మారిక గిరిజన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 27 మంది విద్యార్థులకు గురువారం వల్లంపూడి యువత సెటర్లు పంపిణీ చేశారు. సిఆర్‌పిఎఫ్ ఉద్యోగి రుద్ర హరి, జి.ప్రసాద్, సేనాపతి జ్యోతి రూ.10 వేలతో వీటిని కొనుగోలు చేసి, విద్యార్థులకు అందజేసి, ఉదార స్వభావాన్ని చాటుకున్నారు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామ రెవెన్యూ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని తహశీల్దార్ కృష్ణలతకు గురువారం విఆర్ఎలు వినతి పత్రాన్ని అందించారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఎల సంఘ జెఎసి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పే స్కేల్ వర్తింపజేయాలని, నామినీలను విఆర్ఎలుగా నియమించి అర్హులకు ప్రమోషన్ కల్పించాలని కోరారు. కారుణ్య నియమకాలు చేపట్టాలని చెప్పారు. విఆర్ఎల సమస్యలపై ఈ నెల 16న మంగళగిరి సీసీఎల్ఎ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎ సంఘ నాయకులు జగన్, రాజు, శ్రీను, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి నియోజకవర్గ సమావేశం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చినతాడివాడ సర్పంచ్ ఇంటి దగ్గర శుక్రవాఈరం నిర్వహించనున్న నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి వైసిపి నాయకులంతా హాజరు కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మునాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేవంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నియోజవర్గ పరిశీలకులు నక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొంటారని నాలుగు మండలాల నాయకులు పాల్గొవాలని కోరారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదినారాయణ స్ఫూర్తిదాయకుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని కెఎల్‌పురానికి చెందిన అవయవ దాత ఆదినారాయణ సేవలు స్ఫూర్తిదాయకమని జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకట్రావు అన్నారు. ఆయన జ్ఞాపకార్థం సారిక గ్రామంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్, జన విజ్ఞాన వేదిక సంయుక్త నిర్వహణలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత అవయవదాత ఆదినారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం ముఖ్య అతిథి విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు. విశిష్ట అతిథి వెంకటరావు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ ఆదినారాయణ సేవలు అమూల్యమైనవి అవయవదానం అనేది మహోన్నతమైన కార్యక్రమమని అన్నారు. కార్యక్రమంలో 105 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవయవ దాత భార్య పైడిరాజు కుమారుడు గౌరీశంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

జాతీయ స్థాయికి ఏడుగురు ఎంపిక

ప్రజాశక్తి - బొబ్బిలి

కోల్‌కత్తాలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే సీనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ ఎన్.వెంకటనాయుడు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచడంతో జి.అనిల్ కుమార్, పి.నవీన్, ఎం.దుర్గాప్రసాద్, ఎం.లావణ్య, ఎ.తేజస్విని, పి.మౌనిక, చైతన్య కుమారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు బొబ్బిలి మండలం పారాది జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. వీరిని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కూన రవికుమార్, జిల్లా అధ్యక్షులు బేబినాయన అభినందించారు.

మండల సమాఖ్య సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి-కొత్తవలస

విజన్ బిల్డింగ్‌పై కొత్తవలస మండల సమాఖ్య సభ్యులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఎపిఎం వెంకటరమణ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో ప్రతి సభ్యురాలు సంఘ, గ్రామ గమ్యాలు, అంతర్గత ప్రణాళికలు తయారు చేయాలన్నారు. నాయకత్వ బలోపేతం, నాయకుల సామర్థ్యాల పెంపు తదితర అంశాలు చర్చించారు. కార్యక్రమంలో విఒఎలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - సంతకవిటి

పదో తరగతి విద్యార్థుల విద్యాభ్యాసాన్ని మరింత బలోపేతం చేయడానికి యుటిఎఫ్ నాయకులు గురువారం మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు బూరాడ శ్రీనివాసం మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులతో కలిసి మోడల్ టెస్ట్ పేపర్లను రూపొందించామన్నారు. ఈ మెటీరియల్ విద్యార్థుల పరీక్షా సిద్ధతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మొత్తం 85 మంది పదో తరగతి విద్యార్థులకు ఈ మోడల్ పేపర్లను ఉచితంగా అందజేశామన్నారు. మోడల్ టెస్ట్‌లు విద్యార్థులకు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు తోడ్పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కోఆప్షన్ సభ్యుల ఎన్నిక

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లి మండల కోఆప్షన్ సభ్యులుగా షేక్ జైనాబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి సాల్మన్‌రాజు ఈ ఎన్నికను నిర్వహించారు. గతంలో కోఆప్షన్ సభ్యునిగా ఉన్న షేక్ రజాక్ మరణించడంతో ఆయన భార్య షేక్ జైనాబిని ఎన్నుకున్నారు. షేక్ జైనాబి ఏకగ్రీవం కావడం పట్ల ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు రాపాక సూర్య ప్రకాశరావు, వైస్ ఎంపిపిలు మీసాల సరోజని, గొండెల ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, మాజీ ఎంపిపి బండారు బంగారం, తదితరులు అభిందించారు.

మెరకముడిదాం : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి డివి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో గురువారం కో ఆప్షన్ మెంబెర్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. మెరక ముడిదాం గ్రామానికి చెందిన షేక్ సుబాన్ పేరును మెరక ముడిదాం ఎంపిటిసి బోనెల గోపి ప్రతిపాదించగా, సోమలింగాపురం ఎంపిటిసి సిరివూరి సీతారామరాజు బలపరిచి నామినేషన్ దాఖలు చేశారు. నిర్ణీత సమయంలో ఒక్క నామినేషన్ మాత్రమే వేయడంతో స్క్రూట్నీ అనంతరం సమర్పించిన పత్రాలు సరిగా ఉన్నాయని నిర్ధారించి ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం షేక్ సుభాన్ చేత ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి డివి మల్లిఖార్జునరావు ప్రమాణస్వీకారం చేపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాడ్డి కృష్ణవేణి, మండల ఉపాధ్యక్షులు తలచుట్ల హరిబాబు, కందుల పార్వతి, ఎంపిడిఒ జి. భాస్కరరావు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

సర్వేలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-వేపాడ

గ్రామస్థాయిలో చేపడుతున్న సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ.. సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. దళారులు కొంతమంది ఆర్‌టిఐ దరఖాస్తులు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆ సంస్కృతికి స్వస్తి పలకాలని సూచించారు. అటువంటి వారికి తగిన గుణపాఠం చెప్పడానికి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జగ్గయ్యపేటలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సత్యవతి, అనిల్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ ఎరినమ్మ, మహిళా కానిస్టేబుల్ ఉమ, గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

‘రూ.3 కోట్లతో అభివృద్ధి చేసింది మేమే’

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నోరుంది కదా అని లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకోమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవిని ఉద్దేశించి పతివాడ ఎంపిటిసి, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు అన్నారు. ఇటీవల ఆమె పతివాడలో పర్యటించి గ్రామంలో అభివృద్ధి శూన్యమంటూ విమర్శించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన గురువారం పతివాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పతివాడ పంచాయతీ పరిధిలో సుమారుగా రూ.3కోట్లతో అభివృద్ధి పనులు చేసామన్నారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పదవిలో ఉండి అర్థరహితమైన ఆరోపణలు చేసి దిగ జారుడు రాజకీయం చేయొద్దన్నారు. గత వైసిపి పాలనలో పతివాడ గ్రామంలో జరిగిన అభివృద్ధికి కూటమి సర్కారు అధికారం చేపట్టిన 18 నెలలు కాలంలో జరిగిన అభివృద్ధికి బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గ్రామాలలో పర్యటన చేసినప్పుడు గ్రామాలలో వుండే సర్పంచ్, ఎంపిటిసిలను ఉద్దేశించి పరిపక్వత లేని మాటలతో దూషించడం మానుకోవాలని హితవు పలికారు. ఆయనతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

60 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండలంలోని రావివలస గ్రామంలో సత్యరామ డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో నాల్గవ రోజు గురువారం మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. విజయనగరం పుష్పగిరి కంటి హాస్పిటల్ సారథ్యంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. గ్రామంలో ముందుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి కంటి సంబంధిత సమస్యలు వున్నవారిని తీసుకువచ్చి దగ్గరుండి నిపుణులతో పరీక్షలు జరిపించారు. ఈ పరీక్షలలో సుమారు 25 మందికి సస్త్ర చికిత్సలు అవసరమైనట్లు వైద్యులు నిర్ధారించారు. పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తున్నట్లు వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ టి. ముకుందరావు, మానవీయతా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు, హిస్పిటల్ సిబ్బంది పూజిత, లెనిన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-బాడంగి

సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరావు, నాయకులు ఎస్.గోపాల్, సింహాచలం కోరారు. గురువారం మండలంలోని గొల్లాదిలో సిఐటియు జాతీయ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని, నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతున్నారని దుయ్యబట్టారు. విద్య, వైద్యం వ్యాపారమయం చేశారని ధ్వజమెత్తారు. వీటన్నింటిపై విశాఖలో జరిగే సిఐటియు మహాసభలో చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందిస్తారని తెలిపారు. జనవరి నాలుగో తేదిన ఆర్‌కె బీచ్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి చొరవతో పూసపాటిరేగ ఉన్నత పాఠశాల వద్ద ఆర్ అండ్ బి రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో సుమారుగా 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ఆర్అండ్‌బి రహదారిని ఆనుకొని ఉండటంతో పాఠశాలకి వచ్చే వెళ్లే పిల్లలకు వాహనాలు రాకపోకలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగా రోడ్డు దాటినప్పుడు అనేకసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నిసార్లు ఆర్అండ్‌బి అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో ఇటీవల ఉపాధ్యాయులతో పాటు, విలేకర్ల ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆమె స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలో దేవాడ గ్రామ పరిధిలోని తోటలో దుర్గమ్మను గురువారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్ దర్శించు కున్నారు. అనంతరం కోళ్ల దంపతులు చండీహోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల వెంకటరమణ, నాయకులు కనకాల శివ, నక్కరాజు చిన రాము పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా కొడితే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి, డిపిఒ మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలోని సోమలింగాపురం సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను, హాజరుపట్టికను తనిఖీచేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి రామునాయుడు సచివాలయానికి హాజరు కాకపోవడంతో సోకాజ్ నోటీసు ఇస్తామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న అన్ని సచివాలయాలూ ఇక నుంచి సందర్శిస్తానని ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి చందక శ్రీరాములు, పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిపిఒ మల్లికార్జునరావు

‘శక్తి’తో మహిళల భద్రత వారి చేతుల్లోనే

ప్రజాశక్తి -కంటోన్మెంట్

శక్తియాప్‌తో మహిళల భద్రత వారి చేతుల్లోనే ఉంటుందని మహిళా పోలీసుస్టేషన్ సిఐ ఇ.నర్సింహమూర్తి అన్నారు. నగరంలోని తోటపాలెం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో మహిళల భద్రత, రహదారి భద్రత, డిజిటల్ అరెస్టు పట్ల అవగాహన సదస్సు నిర్వహిాచారు. ఈ సందర్భంగా సిఐ నర్సింహమూర్తి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు తమ స్మార్ట్ ఫోనులో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకుంటే, మహిళల భద్రత వారి చేతుల్లో ఉన్నట్లేనన్నారు. ఆపద సమయంలో ఈ యాప్ లోని ఎస్ఒఎస్ బటన్ ను ప్రెస్ చేసినా, మొబైల్ ఫోనును అటూ ఇటూ కదిలించినా వారు లొకేషను, చిన్న వీడియో, ఆడియో ఆటోమేటిక్ గా రికార్డు అయి దగ్గరలోవున్న పోలీసు స్టేషనుకు సమాచారం అందుతుందన్నారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ఆపదలో ఉన్న వారిని రక్షించే అవకాశం ఉంటుంద న్నారు. కార్యక్రమంలో వుమన్ పిఎస్ ఎస్ఐ శిరీష, పోలీసు స్టేషను సిబ్బంది. శక్తి టీమ్స్, విద్యార్థినులు పాల్గొన్నారు.